

ఎఫ్‌సీఐ కాలనీలోని పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

కాలనీల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి కాలనీలను మరింతగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగా ల్లో విశేషంగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రాబోయే కాలంలో నియోజకవర్గంలో మిగిలిపోయిన ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించి కాలనీలను మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, ఎఫ్‌సీఐ అధ్యక్షుడు ఆది నర్సింహారావు, చంద్రశేఖర్‌రెడ్డి, రాజుయాదవ్, డాక్టర్ కృష్ణారావు, వాణి, అనురాధ, ఝాన్సీ, మల్యాద్రి, మురళీ, ఆచార్య పాల్గొన్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చండి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి తుర్కయంజాల్ గ్రామస్థుడు వినతి



ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న తిరుమలేష్

హయత్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సరిపడ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామానికి చెందిన గుడ్ల తిరుమలేష్ ఆదివారం తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని అందుకు సరిపడ ఉపాధ్యాయులు లేరని తెలిపారు. త్వరగా ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జిల్లా విద్యాధికారితో మాట్లాడి ఉపాధ్యాయుల కొరతను తీర్చనున్నట్లు తెలిపారు.



కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

డివిజన్ అభివృద్ధే ధ్యేయం: కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో కార్పొరేటర్ ఆదివారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సద్గురునగర్‌లోని డ్రైనేజీ సమస్యలు, సీసీరోడ్డు నిర్మాణం, జైహింద్‌బాబు గల్లిలోని పార్కు, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని ఆయా కాలనీవాసులు కార్పొరేటర్‌కు విన్నవించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ కంచర్ల కవిత, కాలనీల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, రాంరెడ్డి, సాయికిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు సమాజసేవ చేయాలి: ప్రొ. కృష్ణయ్య



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ప్రొఫెసర్ కృష్ణయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఏ.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. విద్యార్థులు తప్పని సరిగా ఎన్ఎస్ఎస్ శిబిరాల్లో పాల్గొనాలని చెప్పారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రే. పద్మావతి, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ దేవిడి గీతా వేణుగోపాల్‌రెడ్డి, రవితేజ, రోహిణి, మీనా, అర్చన, గాయత్రి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి : నవజీవన్‌రెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం : కాలనీవాసులు ఎదుర్కొంటున్న ప్రజాసమస్యలను పరిష్కరిస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. ఆటోసాయినగర్ కాలనీలో కార్పొరేటర్ ఆదివారం పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల వల్ల వరదనీటి కాలువ మ్యాన్‌హోల్ కవర్ ధ్వంసం కావడంతో వర్షం కురిసినప్పుడల్లా వరదనీరు రోడ్డుపైకి రావడంతో తమ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్‌కు తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షానికి ధ్వంసమైన వరదనీటి కాలువ మ్యాన్‌హోల్ మరమ్మతు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యలను పరిష్కరిం చి డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

అమావాస్య.. అన్నప్రసాద వితరణ



భోజనం వడ్డిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

మన్సూరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమావాస్య సందర్భంగా జైవాసవి అన్నపూర్ణ వైశ్య సంఘం నాగోల్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా విచ్చేసి పాదచారులు, వాహనదారులు, అన్నార్థులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జగిని అశోక్, ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్వహణకు విరాళం



గోశాల కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న జక్కిడి రఘువీర్‌రెడ్డి

మన్సూరాబాద్ : డివిజన్ పరిధిలోని జడ్జెస్‌కాలనీ ఫేజ్-1లో గల గోశాల నిర్వహణకు బీఆర్ఎస్ మన్సూరాబాద్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి విరాళం అందజేశారు. అమావాస్య సందర్భంగా ఆదివారం కాలనీలో గోపూజ, గణపతి హోమం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గోశాల కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జక్కిడి రఘువీర్‌రెడ్డి పూజల్లో పాల్గొని తనవంతు సాయంగా రూ.లవేలను గోశాల నిర్వహణకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు మొరిశెట్టి సంతోష్‌కుమార్, గోశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివారులో కురిసిన వర్షం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్ద అంబర్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. సుమారు గంట పాటు వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. వర్షంతో రోడ్లపై వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు.

శరన్నవరాత్రోత్సవాలకు ఆలయాలు ముస్తాబు

నేటి నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు.. వివిధ అవతారాలలో కొలువుదీరనున్న అమ్మవారు



ముస్తాబైన మాతామైదాన్‌లోని విజయదుర్గమాత ఆలయం



జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి ఆలయం



ముస్తాబైన నాగోల్‌లోని మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలో గల దుర్గాదేవి ఆలయ మండపం

సైదాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమై అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించేందుకు సైదాబాద్, మలక్‌పేట, మాదన్నపేట, అక్బర్‌బాగ్‌లలో ఆలయాలు, మండపాలు ముస్తాబవుతున్నాయి. కాలనీల్లోని ప్రధాన కూడళ్లలో దుర్గామాత ప్రతిమలను ప్రతిష్ఠించి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి మండపాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సైదాబాద్ మాతా మైదాన్‌లోని విజయదుర్గమాత ఆలయం, జీవనజ్యోతి సంఘంలోని శ్రీజయదుర్గాదేవి ఆలయంలో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారు వివిధ అవతారాలలో కొలువుదీరనున్నారు. మలక్‌పేట పల్టన్‌లోని శ్రీ హరిహర క్షేత్రం, దేవస్థానం, సైదాబాద్ జైలుగార్డెన్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, ఎస్‌బీహెచ్‌కాలనీ ఏ, బీ, జీపీ కాలనీలలోని ఆలయాలలో, ఇంద్రప్రస్థకాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం కరన్‌బాగ్ మల్లికార్జున ఆలయంలో, పెద్దతోట అమ్మవారి ఆలయాలలో ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి నవరాత్రి పూజలు ప్రారంభించనున్నారు. వివిధ ప్రాంతాల్లో దుర్గామాత ప్రతిమను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో..

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలోని దుర్గామాత ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు, సరస్వతి దేవి ఆలయంలో నేటి నుంచి అక్టోబరు 2వరకు జరగనున్న అలంకరణ మహోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ఆలయ ఈవో ఎస్.లావణ్య, ధర్మకర్తలు పేర్కొన్నారు. ఈనెల 22న దుర్గామాత ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారం, 23న గాయత్రీదేవి అలంకారం, 24న అన్నపూర్ణాదేవి అలంకారం, 25న గౌరీదేవి అలంకారం, 26న లక్ష్మీదేవి అలంకారం, 27న లలితాదేవి అలంకారం, 28న వైష్ణవీదేవి అలంకారం, 29న సరస్వతి దేవి అలంకారం, 30న దుర్గాదేవి అలంకారం, అక్టోబరు 1న మహిషాసుర మర్దినిదేవి అలంకారం, 2న రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు, సాయంత్రం 6గంటలకు విజయదశమి, శమీపూజ, రావణ దహనం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈనెల 29న మూల నక్షత్రం రోజు ఉదయం 4గంటలకు సరస్వతిదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణలు, 8గంటల నుంచి సామూహిక అక్షరాభ్యాసములు, సాయంత్రం 6గంటలకు సద్దుల బతుకమ్మ నిర్వహించనున్నట్లు, దేవి నవరాత్రులను పురస్కరించుకొని వేద పండితులు, అర్చకులు ప్రతి రోజు ఉదయం 7గంటలకు చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్, ఈవో పేర్కొన్నారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరుచున్నారు.



మన్సూరాబాద్ సహారారోడ్డులోని పోచమ్మ ఆలయ మండప విద్యుద్దీపాల స్వాగత తోరణం

పదకొండు అవతారాల దుర్గమ్మకు విశేష పూజలు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మన్సూరాబాద్ సాయినగర్‌కాలనీలోని దుర్గమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద పదకొండు అవతారాలతో దర్శనమిచ్చే దుర్గమ్మకు విశేష పూజలు నిర్వహిస్తాం. పదకొండు రోజుల పాటు నిష్ఠగా బాలత్రిపుర సుందరి మొదలు రాజరాజేశ్వరి అవతారం వరకు అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేస్తాం. ఈ ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున విచ్చేసే భక్తులకు మండపం వద్ద తగిన ఏర్పాట్లు చేశాం.

- పోచబోయిన గణేశ్‌యాదవ్, చైర్మన్, దుర్గాదేవి ఆలయం, శ్రీసాయినగర్‌కాలనీ, మన్సూరాబాద్

నిత్య అన్నదానం

శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాం. నిత్యం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నాం, భారీగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు, వీఐపీలు రానున్న దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.

- కొరుడు అమరేశ్వర్, చైర్మన్, శ్రీజయదుర్గాదేవి ఆలయం



కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ ముఖద్వారం

సమాజాభివృద్ధిలో ఫ్యాషన్ డిజైన్‌ది కీలకపాత్ర : ఎంపీ ఈటల



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, చిత్రంలో ఎన్ఐఎఫ్‌డీ డైరెక్టర్ రాముయాదవ్

మన్సూరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కాలానికి అనుగుణంగా సమాజాభివృద్ధిలో ఫ్యాషన్ డిజైన్ సైతం కీలకంగా మారుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్(ఎన్ ఐఎఫ్‌డీ) ఆధ్వర్యంలో ఓరెండా-4 ఫ్యాషన్ షో, గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఎన్ఐఎఫ్‌డీ సంస్థ డైరెక్టర్ కె.రాముయాదవ్‌తో కలిసి అతిథులు కాసం వెంకటేశ్వర్లు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్, గ్లోరియస్ మిస్ఇండియా-2025 పూజపటేల్, సిమ్రాన్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ సమాజంలో కీలకంగా ఉన్న ఫ్యాషన్ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం ఉన్నాయని, ఫ్యాషన్ రంగం ఎంచుకున్న వారికి ఎన్ ఐఎఫ్‌డీ ఓ గొప్ప వేదిక అన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్‌ను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న రాముయాదవ్‌ను ఈటల అభినందించారు. అనంతరం ఎన్ఐఎఫ్‌డీ సంస్థలో గ్రాడ్యుయేషన్ పొందిన వారికి సర్టిఫికెట్లు, యూట్యూబ్ రంగంలో తమదైన శైలిలో రాణిస్తున్న వారికి మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మోడల్స్ ప్రదర్శించిన ఫ్యాషన్ షో అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణయాదవ్, ఏనుగు సుదర్శన్, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, హెచ్ ఎస్‌డీ డైరెక్టర్ క్రాంతి, బీజేపీ రాష్ట్ర నాయకులు సామల పవన్‌రెడ్డి, ప్రవీణ్, అనితారెడ్డి, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నేలపాటి రామారావు పుట్టినరోజు వేడుకలు

- రోగులకు, అనాథలకు, మానసిక దివ్యాంగులకు పండ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ



అనాథ ఆశ్రమం విద్యార్థులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు

వనస్థలిపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు పుట్టినరోజు వేడుకలు ఆదివారం వనస్థలిపురంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామారావుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, పలు కుల సంఘాల నాయకులు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి కేక్ కట్‌చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలోని రోగులకు, శాంతినికేతన్ మానసిక పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ, అనాథ ఆశ్రమానికి నెలకు సరిపడ నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ హంగు, ఆర్భాటాలు లేకుండా ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు వేడుకలు సమాజంలోని అణగారిన వర్గాల వారి శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. సమాజసేవకు నిరంతరం తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికి రామారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బడంగ్‌పేట.. ఓ 'చెత్త కార్పొరేషన్'

- పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్యం
- బీజేపీ నేత శ్రీరాములుయాదవ్ ధ్వజం



చెత్త కుప్పలను తొలగిస్తున్న శ్రీరాములుయాదవ్ తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోజూ ప్రజలు తిరుగాడే రోడ్లపై పేరుకుపోతున్న చెత్త కుప్పలను కూడా తొలగించలేని దుస్థితిలో బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులు ఉన్నారని, దాంతో ఇదో చెత్త కార్పొరేషన్‌గా మారుతోందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ఆరోపించారు. అధికారులు స్వలాభం కోసం తప్ప ప్రజల కోసం పని చేసే పరిస్థితులు కనిపించడంలేదని ఆయన విమర్శించారు. బడంగ్‌పేట్ మల్లాపూర్‌లోని సీఎస్‌రెడ్డికాలనీ రోడ్లపై నెలల తరబడి పేరుకుపోయిన చెత్త కుప్పల విషయాన్ని స్థానికులు బీజేపీ నాయకుల దృష్టికి తీసుకురావడంతో.. సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆదివారం అక్కడ స్వచ్ఛ భారత్ కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములుయాదవ్ పాల్గొని చీపురుపట్టి రోడ్డు ఊడ్చి చెత్తను ట్రాక్టర్‌లో వేశారు. అక్కడ మళ్లీ చెత్త వేయకుండా ఉండేందుకుగాను సొంత ఖర్చుతో గ్రీన్ మెష్(జాలీ) ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోతున్నా తొలగించే నాథుడే కరువయ్యాడని ధ్వజమెత్తారు. కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలోనూ ఇదే దుస్థితి ఉన్నదని, అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, వరికుప్పల వెంకటేశ్ , కొంతం మురళీధర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, చైతన్య, కిరణ్‌రాజ్, రాహుల్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు ఈశ్రమ్ కార్డు ప్రయోజనాలు పొందాలి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులందరు కేంద్ర ప్రభుత్వ కార్మికశాఖ ప్రవేశపెట్టిన ఈశ్రమ్ కార్డుల ద్వారా వచ్చే ప్రయోజనాలు ఉపయోగించుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో కుంట్లూర్ ఆర్ఎన్ఆర్‌కాలనీ ఫేజ్-3 భూ పోరాట కేంద్రంలో ఈశ్రమ్ కార్డు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యాదిరెడ్డి మాట్లాడుతూ సామాజిక భద్రత కోసం ఈశ్రమ్ కార్డులను తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్, నాయకులు అరుణ, నవనీత, నిరంజన్, గోపీ, వినోద్ పాల్గొన్నారు.

సరూర్‌నగర్ చెరువులో గుర్తుతెలియని మృతదేహం

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువులో గుర్తుతెలియని మృతదేహాన్ని సరూర్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి సరూర్‌నగర్ పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుమారు 40 నుండి 45 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని మృతదేహం సరూర్‌నగర్ చెరువులో తేలియాడుతుండడం గమనించిన స్థానికులు సరూర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

భర్తతో గొడవపడి చంటిపాపతో భార్య అదృశ్యం

వనస్థలిపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి చంటిపాపను వెంటతీసుకుని మహిళ అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం డివిజన్ ఆర్టీసీ కాలనీలో గోనెల రవి తన భార్య కళ్యాణి, కూతురితో కలిసి నివాసముంటున్నారు. కాగా ఈనెల 18న రవి కళ్యాణి దంపతులు గొడవపడ్డారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన కళ్యాణి(22) తన భర్త పనిమీద బయటకు వెళ్లిన సమయంలో ఎవరికి చెప్పకుండా అదే రోజు తన 18నెలల కూతురితో కలిసి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో భర్త రవి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువుకట్ట రెయిలింగ్‌కు గుర్తుతెలియని మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సరూర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45సంవత్సరాల వయస్సు గల మహిళ సరూర్‌నగర్‌చెరువు కట్ట రెయిలింగ్‌కు ఉరేసుకుని ఉండడాన్ని ఆదివారం స్థానికులు గమనించారు. వెంటనే సరూర్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

చంపాపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): లారీ అదుపుతప్పి రహదారి పక్కన దుకాణంలోకి దూసుకెళ్లింది. భద్రాచలం నుంచి శంషాబాద్‌కు టీఎస్ 05ఎస్ యూఎఫ్ 1929 నెంబరు లారీ ఇసుకలోడ్‌తో వెళ్తుండగా ఆదివారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌బాబానగర్ షోయబ్ హోటల్ వద్ద అతివేగంతో రహదారి పక్కన ఉన్న బండల దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. అక్కడే బైక్‌పై వెళ్తున్న ముజీద్(32) భయంతో కింద పడటంతో అతని చేతికి తీవ్ర గాయాలైనాయి. లారీని అతివేగం, అజాగ్రత్తతో నడిపి ప్రమాదానికి కారుకుడైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు, డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.



గడ్డిఅన్నారంలోని గౌతమినగర్‌కాలనీలో బతుకమ్మ సంబరాల్లో మహిళలతో పాల్గొన్న జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దేవిరెడ్డి కమల సుధీర్‌రెడ్డి



అష్టలక్ష్మీ ఆలయ మైదానంలో వర్షంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



కవాడిపల్లిలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న మహిళలు



చంపాపేట డివిజన్ క్రాంతి యువజన సంఘం ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు



అష్టలక్ష్మీ ఆలయంలో గౌరమ్మ పూజల్లో మహిళలు

ఎల్బీనగర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ పరిధిలోని అల్కాపురికాలనీ పార్కులో, వాసవీకాలనీ అష్టలక్ష్మీ ఆలయ ప్రాంగణంలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంబరాలలో మహిళలు పెద్దఎత్తున పాలొని తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతు ఆడారు. అల్కాపురికాలనీ పార్కులో జరిగిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి కాలనీ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అష్టలక్ష్మీ ఆలయ మైదానంలో జరిగిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. భారీ బతుకమ్మను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను నీటిలో వదిలారు.

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్లలోని మహిళలు ఆదివారం రాత్రి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తంగేడు, గునుడు, ముత్యాల పువ్వులు, తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి మహిళలు, యువతులు, చిన్నారి బాలికలు దాండియా, ఆట, పాటలతో సంబురాలు జరుపుకున్నారు. అమావాస్య మొదలుకొని దుర్గాష్టమి వరకు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ సందడి నెలకొననుంది. చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలతో పూల పండుగ ముగియనుంది.



అల్కాపురికాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాల్లో మాజీ కార్పొరేటర్ సురేఖ భాస్కర్‌రెడ్డి, కాలనీ మహిళలు